విధివిలాసం

# ధర్మమే జయం

కౌండిన్య

"ఎందుకనో: మా కింత ఆకలి. దరిద్రులం కాబట్టేనేమో. మా కడుపులో ప్రవేశించి ఎముక ఎముక సందునా పీల్చి పిప్పిచేయకపోతే అజీర్తితో తీసుకొనే భాగ్యవంతులదగ్గిర కెందు కెళ్ళగూడదు? ఆకలికికూడా మా బీదాళ్ళ నెత్తు రంటేనే సరదాగాబోలు. అసలుదేవుడుమమ్మల్ని పుట్టించింది బదకటానికిగాదూ? అయితే యెందు కిట్టా వేధించటం...ఇంత బాధపడుతూకూడా బదుకంటే ఇంత తీపెందుకో...చావంటే అంత భయమేం?" అనుకుంటూ కునికిపాట్లు పడుతూ కూచున్నాడు యానాది, దీపపు స్తంభం పక్కనే గుడ్డపరచుకొని.

పట్టణమంతా దసరాతో చాలా సరదాగా ఉంది. పందిళ్లూ, పూల ఓడలు, భజనలు, హరికథలు, ఒక టేమిటి - అదొక స్వర్గమే! అప్పుడే సూర్యు డస్తమిస్తున్నాడు. ఒక ప్రక్కనుంచి చంద్రుడు రావడంచేత అంత చీకటిగా లేదు. రిక్షాల్లోనూ, జట్కాల్లోనూ, నడిచీ, ఎవరి ఓపి కనుబట్టి వాళ్లు తమతమ ఊళ్లు చేరుకొం టున్నారు. కాని ఎవడూకూడా యానాది బొచ్చెలో చిల్లి కానీయైనా పడేసిన పాపాన పోలేదు; వాళ్లుకూడా పాపం హరికథల దగ్గిర, భజన్లదగ్గిర దిబ్బెంలో వేసి జేబులు ఖాళీచేసుకు వస్తున్నారు. 'తమకా పుణ్యం చాలు!' అనుకునే వాళ్లూ ఉన్నారు అందులో.

యానాది కడుపు మండిపోతోంది. అక స్మాత్తుగా ఒక దృశ్యం అతనికంట పడింది. కోమటి రంగమ్మ రిక్షాలో పోతోంది. ప్రక్కనే ఐదేళ్ళ పిల్లాడు. పిల్లాడి చేతులో వెండి విల్లంబు, తళతళా మెరుస్తోంది. పిల్లవాడు రిక్షా కదలికకు జోకొట్టినట్లు నిద్రి స్తున్నాడు. రంగమ్మ మరునాడు తాను చేయా ల్సిన పిండివంటల్లో మునిగి తేలుతోంది. ఆమె ప్రపంచం ఆమెది. యానాదికి ఒక ఊహ తట్టింది. నిద్రపోయే ఆ పిల్లాడిచేతులో విల్లంబు లాగేయటం ఎంత సులభం?

'ఛీ! పాపం కాదా?'

'ఏం పాపమేం? వాడుచూడూ, ఆ పుల్లడు- ఇట్లానేగా సంపాదించాడు యెకరం కుంట!'

'పాడు ఉద్యోగం. నేను రోజూ వాణ్ణి తిట్టటం లా? అంతా నన్నిక అట్లాగే తిట్టరూ?'

'ఏం తిడితే? సుఖపడతావుగా?...అయినా ఎవరా తిట్టేది? ఇట్లాచేసి బాగుపడ్డ వాళ్ళేగా? అదే చాలా ముందుకు వస్తోంది.'

'అమ్మో! నే చేయలేను. లోకం నన్నే మంటుంది - అయ్యొ బాబో, తిట్టి పొయ్యదూ?'

'పోనీ తిట్టేలోక మేమైనా నీ పొట్ట నింపు తుందా?...జాగ్రత్తగా చేసి కొంచెం బాగు పడ్డావంటే నువ్వు తిట్టుతుం దనుకొన్న లోకమే నిన్ను నెత్తి నెక్కించుకొంటుంది. ఆ పుల్లాయికి చూడు, ఎంత గౌరవం వస్తోందో!'

'ఏమైనా సరే, చావనైనా చస్తాగాని చెయ్య లేను'

'చూడు, పాపం! రత్తి నిన్నే ఆశపెట్టుకు నుందే, నాల్గురోజులనుంచి తిండిలేక - ఈపాటికి చచ్చిపోతూ ఉంటుంది. వెళ్లి బతికించొద్దూ! లే, తొందరగా. నిమిషంలో ఐపోతుందిగా పని.'

ఇంతలోకే రిక్షా యానాది ముందుకు వచ్చింది. 'అమ్మా కాని డబ్బు' అని అరిచాడు. అతని అరుపు ఆమెకు వినిపించనే లేదు. రిక్షా దాటింది. యానాదిలో నిర్ణయం వచ్చింది. లేవబోయి, తూలి తట్టుకుని నిలబడ్డాడు. రిక్షా ఒక గజం ముందుకు పోయింది. యానాది గబ గబా నడిచాడు. అటూ ఇటూ పరకాయిం చాడు. మనుషులు చాలా దూరాన ఉన్నారు. చక్రం సందుగా చెయ్యి పోనిచ్చి మెల్లగా లాగాడు విల్లంబు. చేతులోకి వచ్చేసింది. పిల్లాడు ఉలిక్కిపడ్డాడు నిద్రలో. 'లేదులే,

ఊరుకో సాయనా!' అంటూ పిల్లాణ్ణి సముదాయించి మళ్ళీ తన ప్రపంచంలోకి తాను పోయింది రంగమ్మ. యూనాది ప్రక్క సందులోకి తప్పుకొన్నాడు. అంతా కనుమూసి కను తెరిచే లోపల జరిగిపోయింది. 'ఎంత తేలిక' అనుకొన్నాడు యూనాది.

"ఈ సందులోనేగా సుబ్బారాయుడు సెట్టి వెండి కొట్టు .. ఎంత సంపాదించాడు, ఇలా దొంగసొమ్ము కొని. ఒకే చలాకీ. ఇట్టే పోలీసోళ్ళ కళ్ళలో దుమ్ము కొడతాడు. మా పుల్లడు- వాడు బాగుపడ్డాడు, సెట్టిని బాగుచేశాడు." అనుకొంటూ చింపిగుడ్డల చాటున దాచిన విల్లంబు ఉందో లేదో అని తడిమి చూసి తృప్తితో ముందుకు నడిచాడు. వెండికొట్టు సమీపించింది. అప్పుడే పుల్లడు వెండికొట్టు మెట్లు దిగి రోడ్డు మీదికి వస్తున్నాడు. "అదుగో, ఎవరి కొంపో తీశాడు..... అదేంటి వాణ్ణెందుకు తిట్టాలి ? పండగపూటా ఆ పిల్లా డెంత ఏడుస్తాడో నాకేవానికి" అనుకొంటూ ముందుకు సాగాడు. కొట్టు చేరాడు. అప్పుడే పుల్లణ్ణి సాగనంపి సుబ్బయ్యసెట్టి లోపలికి పోతున్నాడు. యూనాది అనుసరించాడు. లోపలి గదిలోకి పోయింతర్వాతనే చంకలోని వెండి విల్లంబు తీసి సుబ్బారాయుడి చేతుల్లో పెట్టాడు యూనాది. సెట్టి కొంచెం ఆశ్చర్యపోయి-

"భలేది కొట్టుకొచ్చావురా!" అంటూ ఇటూ అటూ తిప్పి పరిశీలనగా చూశాడు. అతని నవ్వు కొంచెం మందగించింది. కాని గంభీరంగా-

"ఏతే నరేగాని ఎంత కిస్తానంటావురా!"

"ఏమో దొరగారి దయ. నాల్గురోజుల నుండి తిండికి మాడిపోతుండాను. నా కిదంతా కొత్త. ఇష్టమొచ్చినంత పారేయండి, పోతాను." అన్నాడు యూనాది.

"సరే! ఉండు. ఇప్పుడే వస్తాను." అంటూ విల్లంబు చేత పట్టుకునే బైటికి వచ్చాడు సుబ్బారాయుడు.

అదే సమయానికి కానిస్టేబుల్ మల్లయ్య ఆ దారినే పోతున్నాడు.

"మల్లయ్యబాబూ ! దేవుడిలాగా వచ్చావురా! భలే దొంగని పట్టిస్తా" అంటూ పిలిచాడు కానిస్టేబుల్ను, సుబ్బారాయుడు.

ఎన్నడూ ఎంత ప్రయత్నించినా ఏ ఆచూకీ ఇవ్వనిసెట్టి ఈవాళ ఇలా తనంతటతానే ఆహ్వానించటం కానిస్టేబుల్కు ఆశ్చర్యాన్ని కలిగించింది. వెంటనే మెట్లెక్కి బయలుదేరాడు లోపలికి. పోలీసును చూసేటప్పటికి యూనాదికి పైప్రాణం పైనే పోయింది.

"ఆ రైటు వెల్తుర్లో దీనిపై విలాసం చూడు మల్లయ్యబాబూ!" అంటూ విల్లంబు చేతికిచ్చాడు సెట్టి.

పరికించి, "బూరుగుల సుబ్బారాయుడు" అన్నాడు మల్లయ్య. యూనాది ఉక్కిరి బిక్కిరైనాడు.

"ఔను బాబూ ఔను. మనదే. మొన్ననే మా వెధవకి చేయించా, మా యింటావిడ పోరు పడలేక. నూరు రూపాయిలైంది. ఎట్టా దొంగిలించుక వచ్చాడో పీడు. కష్టార్జితం, నడి సముద్రంలో పారేసినా నట్టింటికి వస్తుంది. ఏంబాబూ! ఏమంటావు? ఎట్టా ఐనా ధర్మానికే జయం."

"ఔను సెట్టిగారూ! ఏరా వెధవా!"

"క్షమించండి బాబూ, ఈరోజు బుద్ధి గడ్డి తింది" అన్నాడు యూనాది వణికిపోతూ.

అదే సమయాన మల్లయ్య, సుబ్బారాయుడు చూపులు ఒకేసారి అక్కడ బల్లమీద పెట్టివున్న వెండిగిన్నెపై పడినై. మల్లయ్య ఆ గిన్నెను చూడటం సెట్టి కనిపెట్టి తత్తరపడ్డాడు. ఆ గిన్నెవైపు నడవటం ప్రారంభించాడు. మొన్న రాత్రి సబ్ జడ్జీ గారి ఇంట్లో దొంగలు పడి దోచుకుపోయిన వస్తువుల్లో ఈ నగిషీ వెండిగిన్నె కూడా ఉండడం అతని మనస్సులో స్పష్టంగా కన్పించింది. సెట్టి గిన్నె తీసి బీరువాలో పెట్టటానికి ప్రయత్నిస్తున్నాడు.

"సెట్టిగారూ ! ఆగండి. ఆ గిన్నె నిటు తెండి."

"కాదండి" అన్నాడు సెట్టి వణికిపోయే కంఠంతో.

"కాదు లేదు, ఔను లేదు. ముందిటు తెండి" అన్నాడు. సెట్టిమీద తనకు చాలా కాలంనుంచీ ఉన్న ఆగ్రహం అంతా ఉట్టిపడేట్లు- జేబులోంచి బేడీలు తీశాడు మల్లయ్య. యూనాదికి, సెట్టికి కలిపి తగిలించి-

"నడవండి స్టేషనికి అన్నాడు."